





ఆధ్యాత్మికం.. ఆధునికం..

జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన తీరు ఇదీ..
లేపాక్షి ఆలయ సందర్శన
రామాయణ శ్లోకాల పఠనం..
ఆధునిక నాసిన్ క్యాంపస్‌కు శ్రీకారం



నాసిన్‌లో శిక్షణ ఇలా ఇస్తున్నాం సర్..



అందరికీ వందనాలు..



లోపలికి పంపితే.. ప్రధానిని చూస్తాం..





హిందూపురం, జనవరి 16: జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఆధ్యాత్మికం, ఆధునికతల కలబోతగా సాగింది. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన ఏర్పాటైన నాసిన్ (కస్టమ్స్ పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ శిక్షణ సంస్థ) ప్రారంభోత్సవానికి ప్రధాని మంగళవారం జిల్లాకు విచ్చేశారు. తొలుత లేపాక్షిలోని ప్రపంచ ప్రసిద్ధ వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అయోధ్యలో ఈనెల 22వ తేదీన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో 11 రోజుల ఉపవాసం పాటిస్తున్న ప్రధాని ఆధ్యాత్మిక భావన, ప్రశాంతతతో ఆలయ సందర్శన గావించారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేళ రామాయణంతో ముడిపడిన లేపాక్షిని సందర్శించడం పుణ్యఫలంగా ప్రధాని అభివర్ణించారు. ఆలయంలో స్వామివారికి స్వయంగా మోదీ హారతి ఇచ్చారు. అక్కడే ధ్యానం చేశారు. భక్తులతో కలిసి భజన చేశారు. శ్లోకాలు పఠించారు. దేశీయ జానపద కళల్లో ఒకటైన తోలు బొమ్మలాటను ఆసక్తిగా వీక్షించారు. ఆలయ అర్చకులు, తోలుబొమ్మల కళాకారులను శాలువాలతో సత్కరించారు. ప్రధాని భక్తి తన్మయత్వంతో ఆలయ సందర్శనను పూర్తి చేశారు. అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో నాసిన్‌కు బయల్దేరి వెళ్లారు.

ఆధునిక శిక్షణ సంస్థకు శ్రీకారం

అత్యాధునిక సాంకేతికతతో కూడిన నాసిన్ క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్ను వ్యవస్థను సరళీకృతం చేశామన్నారు. జీఎస్టీని అమలు చేయడంతో పన్నుల ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. పన్ను ఎగవేతదారుల ఆట కట్టించామన్నారు. పెద్దమొత్తంలో బోగస్ ఖాతాలను ఏరివేశామన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను తిరిగి వారికే సంక్షేమ పథకాల రూపంలో అందించి, పేదరిక నిర్మూలను కృషి చేస్తున్నామన్నారు. దేశ ఉన్నతిలో కీలకమైన పన్ను వసూళ్లకు నాసిన్ ఎంతగానో సహకారం అందిస్తుందన్నారు. నాసిన్‌లో శిక్షణ పొందినవారు ఆధునికతను అందిపుచ్చుకుని, పన్ను వసూళ్లను పెంచి, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రధాని ప్రసంగంలో పదేపదే శ్రీరాముని సుపరిపాలన గురించి ప్రస్తావించారు. ఇలా ప్రధాని జిల్లా పర్యటన ఆధ్యాత్మికం, ఆధునికతల మేళవింపుగా సాగింది.





శిక్షణ పొందుతున్నవారితో ప్రధాని, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రుల గ్రూప్ ఫొటో..

ప్రారంభోత్సవానికి హాజరైన అధికారులు





కొనసాగిన సమ్మె

36వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె.. జిల్లావ్యాప్తంగా నిరసనలు



అగళిలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

పుట్టపర్తి రూరల్, జనవరి 16: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. పండుగ పూట కూడా అంగన్‌వాడీలు నిరసనలు కొనసాగించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ నేతలు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమ్మెకు దిగితే సంక్రాంతి కానుకగా ఎస్మా ప్రకటించారన్నారు. ఎస్మాను ప్రయోగించడం ప్రజాహక్కులను హరించడమేనన్నారు. షోకాజ్ నోటీసులు పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి, సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముదిగుబ్బ, నంబులపూలకుంట, కదిరి, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, హిందూపురం, అగళి, నల్లమాడ, ధర్మవరం, బత్తలపల్లిలో అంగన్‌వాడీల నిరసనలు కొనసాగాయి.

పట్టు రైతులు, రీలర్ల సమ్మెబాట

నేటి నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయం



మడకశిర రూరల్, జనవరి 16: పట్టు రైతులు,రీలర్లు సమ్మెబాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పట్టురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమకుమార్, మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులెవరూ పట్టుగూళ్లను మార్కెట్‌కు తీసుకురావద్దనీ, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. సమ్మెకు రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆయన ఉద్ఘాటించారు.

చంద్రబాబు కృషి ఫలితంగానే నాసిన్ ఏర్పాటు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి

పెనుకొండ, జనవరి 16: తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగానే గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్ ఏర్పాటైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన నాసిన్ క్యాంపస్‌ను మంగళవారం ప్రారంభించిన నేపథ్యంలో బీకే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ హయాంలో పారిశ్రామికాభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో చంద్రబాబు నాయుడు జిల్లాలో కేంద్ర సంస్థల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. అందులో భాగంగానే పాలసముద్రం వద్ద నాసిన్ క్యాంపస్ ఏర్పాటుకు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారన్నారు. అప్పట్లో స్థానిక శాసనసభ్యుడిగా తనకు అలాంటి బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం ఆనందదాయకమన్నారు. ఇందుకోసం అప్పట్లో 503.10 ఎకరాల భూమిని సేకరించి, కేంద్రానికి అప్పజెప్పామన్నారు. వీటితోపాటు రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం, మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించి, కేంద్రానికి అప్పగించామన్నారు. అప్పటి కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా శంకుస్థాపన చేశారన్నారు. ఆ నాసిన్ నేటికి ఓ రూపునకు వచ్చి కార్యకలాపాలు ప్రారంభించిందన్నారు. ఇంతటి గొప్ప సంస్థను జిల్లా ప్రజలకు అంకితం చేసినందుకు దేశ ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలపడమే కాక, చంద్రబాబు నాయుడు దూరదృష్టిని జిల్లా ప్రజలు ఎంతగానో కొనియాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను తెలుసుకుని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు.



నాసిన్ శంకుస్థాపన వేదికపై కేంద్ర మంత్రులు, నాటి సీఎం చంద్రబాబునాయుడు (ఫైల్)

పండుగకూ బియ్యం ఇవ్వరా?

- గ్రామ సచివాలయాన్ని ముట్టడించిన లబ్ధిదారులు



మెళవాయి సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ లబ్ధిదారులు

మడకశిర రూరల్, జనవరి 16: రేషన్ షాపు ద్వారా సబ్సిడీ బియ్యం పంపిణీ చేయకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ చేయకపోవడంపై మండలంలోని సిద్దగిరి గ్రామ ఎస్సీ కాలనీవాసులు మంగళవారం మెళవాయి గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించి, నిరసర వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఉన్న డీలర్ వద్దంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకుని సచివాలయం వద్దకు వచ్చిన గ్రామ సర్పంచ్ రంగనాథ్, ఎంపీటీసీ నాగరత్నమ్మను చుట్టుముట్టి, నిలదీశారు. ఓట్లు వేసిన పాపానికి తమకు తగిన గుణపాఠం చెప్పారంటూ మండిపడ్డారు. రేషన్ షాపు డీలర్ వద్దంటూ అందరూ సంతకాలు చేసి, తహసీల్దార్‌కు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కాసేపటికి వారు వెళ్లిపోయారు.

ఓటమి భయంతో నాపై అసత్య ప్రచారం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



పుట్టపర్తి, జనవరి 16: వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే తనపై అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. వీటిని ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు ఇటీవల వైసీపీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన రాజకీయ ఎదుగుదల ఓర్చుకోలేక అధికార పార్టీ నాయకులు ఇలా విష ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తాను టీడీపీకి, చంద్రబాబు కుటుంబానికి విధేయుడిగా ఉన్నానని అన్నారు. అవసరమైతే రాజకీయాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతానేగాని, పార్టీని మారే ప్రసక్తే లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిక్కెట్ తనకే వస్తుందని, విజయం తనదేనని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి కష్టనష్టాల్లో పాలు పంచుకుంటున్నాని ఆయన తెలిపారు. వైసీపీ సోషియల్ మీడియాలో అసత్య ప్రచారం గురించి ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.







విశేషాలంకరణలో స్వామివారు, కొత్త కుండల్లో పాలపొంగులు.. పార్వేటోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేత్రపర్వంగా శ్రీవారి పార్వేటోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కదిరి, జనవరి 16: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి పార్వేటోత్సవం మంగవారం నేత్రపర్వంగా సాగింది. స్వామివారికి ఉదయం ఆలయంలో నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు పార్వేటకు ఒంటరిగా బయలు దేరారు. ఆలయం నుంచి భక్తుల గోవింద నామస్మరణ మధ్య తిరువీధుల్లో గిరి ప్రదక్షిణగా కదిరి కొండకు చేరుకున్నారు. అర్చకులు నివేదన, పూజలు గావించారు. అనంతరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పాలపొంగలి ఉట్టికి మధ్యాహ్నం చేరుకున్నారు. కౌలేపల్లికి చెందిన యాదవులు కొత్తకుండలో తెచ్చిన పాలను పోసి, పాలపొంగలితో స్వామివారికి నివేదన చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పార్వేట మండపానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం పార్వేటలో స్వామివారు పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులు పార్వేటను చూడడానికి పెద్దఎత్తున తరలివచ్చారు. రైల్వే ట్రాక్ చుట్టూ ఇసుక వేస్తే రాలనంతగా భక్తులు హాజరయ్యారు. కుందేళ్లను ఎగురవేసి పార్వేటలో పాల్గొన్నారు. భక్తులు కూడా వెంట తెచ్చుకున్న కుందేళ్లను ఎగురవేసి, పార్వేటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం రాయచోటి రోడ్డులోని శమీ మండపానికి స్వామివారు చేరుకుని, పూజలు అందుకున్నారు. అనంతరం అశ్వవాహనంపై చౌక్ మీదుగా తిరువీధుల్లో స్వామివారు ఊరేగారు. అనంతరం ఆలయంలో అలకబూనిన శ్రీదేవి, భూదేవితో సంవాదం చేసి, వారి అలకను తీర్చారు. దీంతో పార్వేటోత్సవం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ఆలయ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పార్వేటోత్సవానికి హాజరైన భక్తులు

అలరించిన శివామృతం



నాటికలోని సన్నివేశం

పుట్టపర్తి, జనవరి 16: సత్యసాయి విద్యార్థులు చేపట్టిన శివామృతం నాటిక భక్తులనుఅలంరింపజేసింది. సోమవారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూలు సమర్పించారు. విద్యార్థులు వేదపఠనంతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ట్రస్టు సభ్యులు బహుమతులు అందజేసి, అభినందించారు. అనంతరం విద్యార్థులు శివామృతం పేరుతో నాటికను ప్రదర్శించారు. నాటికలోని పాత్రధారులు అద్భుత అభినయంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, డాక్టర్ నాగానందం, డాక్టర్ మోహన్, సేవాదళ్ ప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



విజేత విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్జే రత్నాకర్


స్వాగతం మోదీ జీ..(ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్)


ప్రధాని మోదీకి సీఎం జగన్ స్వాగతం


ప్రధానికి గవర్నర్ సత్కారం


అదిగో.. మోదీ..

ఎన్నెన్నో ప్రత్యేకతల అనంత

ప్రధానమంత్రి మోదీ
లేపాక్షి ఆలయ సందర్శన
నాసిన్‌కు శంకుస్థాపన



హిందూపురం, జనవరి 16: అనంత ఎన్నెన్నో ప్రత్యేకతల నిలయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలో ప్రధాని పర్యటించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన, శిల్పకళా నిలయమైన లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారి పక్కనే ఏర్పాటైన నాసిన్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ జాతీయ అకాడమీ)ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ఆధ్యాత్మికత, దేశ నిర్మాణం, సుపరిపాలనతో ముడిపడి ఉందన్నారు. దేశ వారసత్వ సంపదకు ప్రాతినిథ్యం వహిస్తోందన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా ఈ ప్రాంతంలోనే జన్మించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు ఈ ప్రాంతంవారేనన్నారు. ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతంవారేనన్నారు. విజయనగర రాజుల సుపరిపాలనకు ఈ ప్రాంతం వేదికైందని కొనియాడారు. ఇవన్నీ ఈ ప్రాంత స్ఫూర్తిదాయక విశేషాలన్నారు. నాసిన్ కూడా సుపరిపాలనకు కేంద్రబిందువు అవుతుందని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో వాణిజ్యం, పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

ఆలయ సందర్శన

జిల్లా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ తొలుత లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ చరిత్ర, శిల్పసంపద గురించి గైడ్‌లు, అధికారులు.. ప్రధానికి వివరించారు. దుర్గాదేవి, వీరభద్రస్వాములను ప్రధాని దర్శించుకున్నారు.


నాసిన్ ప్రారంభోత్సవ వేదికపై ప్రధాని, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, అధికారులు

స్వయంగా హారతి ఇచ్చారు. అక్కడే ధ్యానం చేసి, శ్లోకాలు పఠించారు. భక్తులతో కలిసి భజన చేశారు. తోలుబొమ్మలాటలను తిలకించారు. ఆలయ అర్చకులు, తోలుబొమ్మల కళాకారులను ప్రధాని సత్కరించారు. అక్కడి నుంచి బయల్దేరి ప్రత్యేక హెలికాప్టర్‌లో నాసిన్‌కు చేరుకున్నారు. నాసిన్ క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడారు. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. శిక్షణ పొందుతున్న ఐఆర్‌ఎస్ అధికారులతో ఫొటోలు దిగారు. తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. ప్రధాని పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.


విమానం దిగి.. చాపర్‌లో..

ప్రధాని మోదీ పర్యటన వివరాలు

హిందూపురం అర్బన్, జనవరి 16: ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి విమానాశ్రయము నుంచి లేపాక్షికి వచ్చిన విమానం 1.30 నిముషాలకు ల్యాండ్ అయ్యింది. అక్కడ నుంచి 1.35 గంటలకు రోడ్డు మార్గంలో ఆలయానికి చేరుకుని దుర్గా వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. 2.56కు ఆలయం నుంచి బయలుదేరి హెలికాప్టర్ వద్దకు వెళ్ళారు.

- ప్రధాని మోదీ రాకతో లేపాక్షి మొత్తం పోలీసుల వలయంలో చిక్కుకున్నట్లయ్యింది. ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు వేసి ప్రజల సంచారాన్ని నిలిపివేశారు. అదే విధంగా చిలమత్తూరు వైపు నంది విగ్రహం అవతల వైపు బారికేడ్లతో అడ్డుకున్నారు. మిద్దెలమీద కూడా ఎవరినీ ఉండకుండా భారీ బందోబస్తు చేపట్టారు.


ప్రధాని కాన్వాయ్.. భద్రత


నాసిన్ వద్ద భద్రత


ప్రారంభోత్సవానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పటిష్ఠ భద్రత నడుమ

గోరంట్ల, జనవరి 16: ప్రధాని నరేంద్రమోదీ లేపాక్షి పర్యటన పటిష్ఠ భద్రత నడుమ కొనసాగింది. మంగళవారం ప్రధాని లేపాక్షి ఆలయ సందర్శనతో పాటు గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద నాసిన్ అకాడమీని ప్రారంభించారు. పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, గవర్నర్ అబ్దుల్‌నజీర్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాని హెలికాప్టర్లో వచ్చినప్పటికి నాసిన్‌కు నలుదిక్కులా ఉన్న గోరంట్ల, హిందూపురం హైవేకి ఇరువైపులా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వేల సంఖ్యలో పోలీసులు ఈప్రాంతాన్ని రెండురోజులుగా జల్లెడ పడుతూ, భద్రత వలయంగా మలిచారు.

ఆమోదించండి...ప్లీజ్

మోదీ పర్యటన సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎంఎస్ నాయకులు పార్టీ జెండాలు పట్టుకుని నాసిన్ ద్వారం వద్ద ప్రధానికి స్వా గతం పలుకుతూ నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కెబి. మధుమాదిగ, గంగాధర్, అమర్, మధుసూధన్, కదిరప్ప, లాలెప్ప, దండోరా నారాయణ, సైకిల్ నరసింహు లు, ఎన్‌సీ నరసింహులు, నరసింహుడు, కుమారస్వామి, స్వతంత్ర్య కుమారి, శాంతమ్మ తదితరులున్నారు.


కార్యకర్తల సందడి

ఆధారేదీ...?

ప్రదాని పర్యటనలో పాల్గొనడానికి వచ్చిన కార్యకర్తలను పోలీసులు ఆదార్ ఉంటేనే పరిశీలించి అనుమతించారు. అయితే కొందరి వద్ద ఆధార్ కార్డు లేకపోవడంతో వారిని అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బీజేపీ జెండాలు, కాషాయం కండువాలు, మోదీ మాస్కులతో వచ్చారు. విధిలేక పోలీసులు వారిని మరో ద్వారం గుండా అనుమతించాల్సి వచ్చింది.


రోడ్డు పక్కనే భోజనం చేస్తున్న పోలీసులు

భో'జనం'..

ప్రదాని పర్యటనకు విచ్చేసిన కార్యకర్తలకు బోజనం దొరకడం ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి బీజే పీ, వీహెచ్‌పీ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, ప్రజలు, అధికారులు నాసిన్ వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్నారు. సకాలంలో భోజనం అందక నానా అవస్థలు పడ్డారు. బీజేపీ నాయకులు జోక్యం చేసుకుని భోజనాలు వాహనాలలో తెప్పించి ప్రజల కు, పోలీసులకు పంచి పెట్టారు. అయితే ఆకలి తీరడానికి తోసుకోవాల్సి వచ్చింది. పోలీసులూ రోడ్లపైనే కూర్చొని తినాల్సివచ్చింది.



ట్రా'ఫికర్' తప్పలేదు...

నాసిన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన వారికి ట్రాఫిక్ కష్టాలు చుక్కలు చూపించాయి. ప్రధాన ద్వారం పక్కనే బెల్ కంపెనీకి కేటాయించిన స్థలంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలం సరిపోకపోవడంతో ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్డుపైనే పార్కింగ్ చేశారు. పోలీసుల వాహనాలు సైతం రోడ్డు పక్కనే ఉంచాల్సి వచ్చింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరా యం ఏర్పడింది. ప్రధాని పర్యటన ముగిసిన త ర్వాత ఒక్కసారిగా వాహనాలు బయల్దేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రధాని


లేపాక్షి ఆలయంలో.. ప్రధాని సమక్షంలో శ్రీరామ నామ సంకీర్తనలు


తోలు బొమ్మలాటను చూస్తున్న ప్రధాని

లేపాక్షి, జనవరి 16: చిత్ర, శిల్ప కళల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ సందర్శించి లేపాక్షిని సందర్శిచిన తొలి ప్రధానిగా నిలిచారు. ప్రత్యేక హెలికాప్టర్లో మధ్యాహ్నం 1.30గంటలకు లేపాక్షికి వచ్చిన ఆయన కాన్వాయ్‌లో నేరుగా ఆలయానికి చేరుకున్నారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో దుర్గా, వీరభద్రస్వాములకు ఆయన ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో ఏర్పాటు చేసిన రామకీర్తనల కచేరి, తోలుబొమ్మలాటను వీక్షించి, పదినిమిషాలు ధ్యానంలో కూర్చున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, కచేరి నిర్వాహకులను స్వయం గా ప్రధాని అభినందించారు. అక్కడి నుంచి నేరుగా పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన నాసిన్ సభకు తరలి వెళ్లారు.

● ఆలయ చరిత్రను వివరించిన అధికారులు

లేపాక్షి సందర్శనకు వచ్చిన తొలి ప్రధాని నరేంద్ర మోదీ. అయితే ఆయనకు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించడంలో అధికారులు విఫలమయ్యారు. వేలాడే స్థంభం, సీతాదేవి పాదం, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికారులు ఇవేవి చూపించలేకపోయారు. అధికారులు ఏ ఉద్దేశంతో ఆయనకు చరిత్రను వివరించలేదోనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యునెస్కో గుర్తింపుకు చేరువలో ఉన్న లేపాక్షి విశిష్టతను ఆయనకు చూపించకపోవడంతో మండిపడుతున్నారు. లేపాక్షికి ప్రధాని రావడం ఆనందకరమని, అయితే చరిత్రను వివరించడంలో విఫలమయ్యారని వాపోతున్నారు.


వీరభద్రుడికి మోదీ హారతి

అధ్యక్షా..ఇదేం తీరు..!



● పాలకవర్గం వర్సెస్ బ్యూరోక్రసీ ● ఉన్నతాధికారుల వైఖరిపై విమర్శలు ● నేటి జడ్పీ సమావేశంపైనే అందరి దృష్టి

అనంతపురం విద్య, జనవరి 16 : జడ్పీలో మోనార్క్స్ పాలన సాగుతోందా..?, పాలకవర్గాన్ని డమ్మీని చేసే యత్నాలు జరుగుతున్నాయా..?, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి సమావేశం కావాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని..నామమాత్రం నిర్వహిస్తున్నారా.. బ్యూరోక్రసీ వర్సెస్ పాలకవర్గం అన్నట్టుగా మారిందా..? అంటే వీటికి కొంత కాలంగా జడ్పీ ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు, వారి వైఖరి అవుననే సమాధానం వస్తోంది. దీనికితోడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సైతం తీరికలేని స్థితిలో ఉన్నారు. ప్రజా సమస్యలపై గళం విప్పేందుకు...కనీసం గంట కూడా జడ్పీ సమావేశానికి కేటాయించలేకపోవడం విచిత్రం.

తీరిక లేని ప్రజాప్రతినిధులు

అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు, ఛైర్‌పర్సన్లు కనీసం జడ్పీ సమావేశాలకు వచ్చే తీరు కూడా వారిని లేనట్లు కనిపిస్తోంది. జడ్పీ అధికారిక లెక్కల మేరకు 2021లో జరిగిన తొలి సమావేశం(పాలకవర్గం ఎన్నిక) మినహా ఇతర సమావేశానికి సగం మంది కూడా ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఇద్దరు ఎంపీలు ఉంటే..రెండు సార్లు మాత్రమే వచ్చారు. శాసన మండలికి వెళ్లే.... ఎమ్మెల్సీలు తీరు కూడా దారుణంగా ఉంది. ఇక కార్పొషన్ పదవులను దక్కించుకున్న ఛైర్మన్లు, ఛైర్ పర్సన్లు అయితే...చుట్టపు చూపుగా కూడా రావడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు, నిరుద్యోగ సమస్యలు తాండ విస్తున్నాయి. మరో 2 లేదా 3 నెల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ కుర్చీల్లో కూర్చున వారికి ఈ సమావేశం బహు శా చివరిది కావచ్చు. ఎన్నికల తర్వాత ఎవరు ఎక్కడ ఉంటారో తెలియ దు. కనీసం చివరి సమావేశానికైనా హాజరవుతారో లేదో వేచి చూడాలి.

అధికారుల తీరుపై గరం..గరం..

గత కొంత కాలంగా జడ్పీలోని కొందరు ఉన్నతాధికారుల వైఖరిపై జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, జడ్పీటీసీలు గరంగరంగా ఉన్నారు. తమ సమస్యలు వినే వారు లేని, పట్టించుకునే వారు లేరంటూ...మండిపడుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం గడిచిపోయింది, ఏం పనులు చేసుకోలేకపోయామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవలికాలంలో అభివృద్ధి పనులకు, స్థానిక సంస్థల నుంచి తీర్మానాలు తేవాలన్న నిబంధనపై కూడా జడ్పీటీసీలు పెదవి విరుస్తున్నారు. ఈ క్రమంలో 2 సార్లు వాయిదా పడి 4 నెలల తర్వాత బుధవారం జరిగే ఈ సమావేశం రసవత్తరంగా ఉంటుందనడంతో సందేహం లేదు.

సమావేశం నిర్వహించిన తేదీ	హాజరైన జడ్పీటీసీలు	హాజరైన ఎమ్మెల్యేలు	ఎమ్మెల్సీలు	ఎంపీలు
25 సెప్టెంబరు 2021	63	9	2	2
18 డిసెంబరు 2021	62	6	1	1
26 మార్చి 2022	61	2	1	1
23 జూన్ 2022	47	2	1	1
24 సెప్టెంబరు2022	48	2	2	2
7 జనవరి 2023	49	3	1	1
6 మే 2023	48	1	0	0
26 ఆగస్టు 2023	41	0	0	1

ప్రమాదరహిత జిల్లాగా నిలుపుదాం

అనంతపురం కల్చరల్, జనవరి 16: రహదారి నిబంధనలు పాటించి, అనంతను ప్రమాద రహిత జిల్లాగా నిల పాలని జేఎన్‌టీయూ ఓటీఆర్‌ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు చేపడుతున్న రోడ్డుభద్రతా మాసోత్సవాల ప్రారంభ సభను సోమవారం అనంతపురం డిపో గ్యారేజీలో నిర్వహించారు. డీఎం నాగభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి దుర్గాప్రసాద్‌తో, ఆర్టీసీ డిప్యూటి సీటీఎం రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్యపానం సేవించడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి చేయరాదన్నారు. కార్యక్రమంలో మూడవ పట్టణ ఎస్‌ఐ గోపాల్, అనంతపురం డిపో అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, జనవరి 16: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. మంగళవారం ఉపాధ్యాయభవన్‌లో అనంతపురం, సత్యసాయి జిల్లాల కొత్త కార్యవర్గాల ఎన్నిక కోసం సీఈ జార్జ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అనంతపురం జిల్లా అధ్యక్షులుగా మంజుల, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా సరోజిని, కృష్ణ, సుజాత, కవితారాణి, ఉప కార్యదర్శులు చాంద్‌భాషా, కాశమ్మ, శంకర్‌రెడ్డి, ధనలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్లుగా విజయ్, డానియల్, దౌలత్ ఖాన్‌ను ఎన్నుకున్నా రు. కొత్త కార్యవర్గానికి ఆ సంఘం సభ్యులు, ఇతర యూనియన్ లీడర్లు అభినందనలు తెలిపారు.


మంజుల


పురుషోత్తం

అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు




గెలుపొందిన ఎద్దుల యజమానులకు బైక్‌ను బహూకరిస్తున్న ముఖ్య అతిథులు, పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

అనంతపురం రూరల్, జనవరి 16: మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీలో రాతిదూలం లాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. గ్రామంలో దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు జాతి రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. సోమవారం న్యూకేటగిరి విభాగంలో, మంగళవారం సీనియర్ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహిం చారు. అదేవిధంగా గుర్రపుస్వారీ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు అనంత వెంకటరామిరెడ్డి జడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు షాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహాయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామంలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల నుంచి రైతులు, ప్రజలు హాజరయ్యారు. మొదటి రోజు న్యూకేటగిరి విభాగంలో 22జతల ఎద్దులు పోటీ పడగా సి.కొత్తపల్లి, కీర్తిపల్లేకి చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి, భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు మొదటి స్థానంలో నిచాయి. రెండు మూడు స్థానాల్లో నంద్యాల జిల్లా ఎస్‌కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ బీరం సుబ్రమణ్యేశ్వరరెడ్డి, కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన మహేశ్వరరెడ్డికి చెందిన ఎద్దులు విజేతలుగా నిలిచాయి. న్యూకేటగిరి విభాగంలో విజేతకు యూనికార్న్ బైక్ బహూకరించగా..సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అందజేశారు. రెండు విభాగాల్లో మొదటి తొమ్మిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతిని అందించారు.

కార్యకర్తల కుటుంబాలకు పల్లె పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి

నల్లమాడ, జనవరి 16: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. మండలపరిధిలోని బొగ్గలపల్లి గ్రామానికి చెందిన మోపూరి చిన్నరామప్ప అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. రామాపురం, బొగ్గపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు. మండల కన్వీనర్ షైలే శివశంకర్, అబ్బాస్‌ఖాన్, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకమర్ల పంచాయతీలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త బడిశం నరసింహులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌ద్వారా పరామర్శించారు. తమ వంతుగా ఆర్థికసాయాన్ని నాయకులు జాకీర్‌అహమ్మద్, బడిశం రామాంజనేయులు అందించారు. రవీంద్రనాయుడు, సాధిక్‌వలి, అంజనేయులు, శంకర్, కొండే ఈశ్వరయ్య, గంగాధర్, ఇర్షాద్, సురేష్, బడిశం నరసింహులు, వెంకటరాముడు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులతో కందికుంట

కదిరి, జనవరి 16: తలుపుల మండలం ఉబ్బరవాండ్లపల్లి, పెన్నబండవాండ్లపల్లి, కొత్తపల్లి, తూపల్లికి చెందిన 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం తలుపుల మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వీరందరికి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉబ్బరవాండ్లపల్లిలో శివారెడ్డి, కేశవరెడ్డితోపాటు పలువురుచేరారు.

రేపు రక్తదాన శిబిరం

కదిరి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కదిరి టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు డైమండ్ ఇర్షాన్, క్రిష్ణమూర్తి, మోపూరిశెట్టి చంద్రశేఖర్, ఎస్‌బి శీనా తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీలో పలు జట్ల విజయం



క్రీడాకారులతో టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, జనవరి 16: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. సోమవారం రెండవరోజు లెవన్ లడ్డూస్, రైజింగ్ స్టార్స్ తలపెడగా లెవన్ లడ్డూస్ గెలుపొందారు. గోవిందురాజుపల్లి, కుంటా వార్రియర్స్ తలబడగా గోవిందురాజుపల్లి గెలుపొందింది. మంగళవారం పెదబల్లి జూనియర్, సీనియర్ జట్లు పోటీపడగా సీనియర్ జట్టు గెలుపొందినట్లు టోర్నమెంటు నిర్వాహకుడు దండె గంగశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజులు, నరసింహారెడ్డి, అజంతుల్లా, నరసింహులు, అంజినప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓటర్లుగా వాడుకుంటున్నారు

- వాల్మీకి సంఘం నాయకులు



మాట్లాడుతున్న బండ్లపల్లి రాజు

కొత్తచెరువు, జనవరి 16: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాల్మీకులను ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లపల్లిరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పాదయాత్ర సమయంలో రాష్ట్రంలోని వాల్మీకులను 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్టీ హోదా కల్పిస్తామని ఓట్లు వేయించుకున్నారన్నారు. ప్రస్తుతం ఐదేళ్లు పూర్తవుతున్నా నెరవేర్చలేదని విమర్శించారు. వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీ టీడీపీ నేనన్నారు. 2024 ఎన్నికలలో వాల్మీకులు టీడీపీకి ఓటు వేస్తే ఎస్టీ హోదా అమలవుతుందన్నారు. సమావేశంలో వాల్మీకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పుట్టపర్తి రూరల్, జనవరి 16: గడ్డివాము అగ్నికి ఆహుతైన ఘటనలో బాధిత రైతు సూర్యనారాయణకు టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆర్థిక సాయం అందించారు. మండలపరిధిలోని వెంగళంచెర్వులో సోమవారం రాత్రి గుర్తుతెలియని ఆకతాయిలు గడ్డివాముకు నిప్పుపెట్టడంతో రెండుట్రాక్టర్ల పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం రైతుకు రూ.ఐదువేల ఆర్థిక సహాయం అందచేశారు.

ఘనంగా సంక్రాంతి పాలపొంగుల వేడుక

అమడగూరు, జనవరి 16: మండలపరిధిలోని కమ్మవారిపల్లిలో గ్రామస్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పాల పొంగులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం యల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజ చేసి, పాల పొంగుల వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు.

అరకొరగా సేద్య పరికరాల పంపిణీ

ఇబ్బందుల్లో రైతులు

తుంపర సేద్యం కింద సాగుచేసిన పంట



గాండ్లపెంట, జనవరి 16: రైతులు ప్రధానంగా బిందు, తుంపర సేద్యాలతో పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. అలాంటి బిందు, తుంపర సేద్య పరికరాలు అందక రైతులు ప్రైవేటు దుకాణాల్లో నాసిరకం పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. జల్లాలో ప్రధానంగా మెట్ట భూమి అధికం. ఈ భూముల్లో ప్రధానంగా కూరగాయాలు, పండ్లతోటలు, వేరుశనగ, ఉద్యానవన సాగు పంటలు సాగుచేస్తున్నారు. ప్రతిరైతు బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరం. అలాంటి పరికరాలను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు ఎకరాలున్న రైతులకు 90శాతం సబ్సిడీతో 5 నుంచి 7 ఎకరాలలోపు ఉన్న రైతులకు 70శాతం, 10 ఎకరాలకు పైగా ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోంది. అవి కూడా కొన్ని కంపెనీలే అందుబాటులో ఉన్నాయి. పెద్ద పెద్ద కంపెనీలకు బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఇవ్వడానికి ముందుకురాలేదు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా దాదాపు వెయ్యిమంది రైతులు దరఖాస్తు చేసుకోగా వారిలో పదిశాతం కూడా రైతులకు పరికరాలు అందలేదు. కదిరి నియోజకవర్గంలోని మండలాల వారీగా కదిరి మండలం 114మంది, తలుపుల 198, నంబులపూలకుంట 61, గాండ్లపెంట 63, నల్లచెరువు 128, తనకల్లు 14మంది రైతులకు గత మూడేళ్లకు పంపిణీ చేసినట్లు మైక్రో ఇరిగేషన్ అధికారం చంద్రశేఖర్ తెలిపారు.

బిందు సేద్యంవైపు రైతుల మొగ్గు

ప్రస్తుతం రైతులు పంటలు సాగుచేయాలంటే బిందు సేద్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలాంటి బిందు సేద్యాలకు ప్రభుత్వం సబ్సిడీతో పరికరాలు అందించకపోవడంతో రైతులు సాగుకు వెనుకంజ వేస్తున్నారు. బిందు సేద్యంతో నీటిఆదాతోపాటు మంచి దిగుబడి, ఖర్చు తక్కువ, విద్యుత్ ఆదా, ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది. రైతులు సూక్ష్మనీటి సైద్యంపైనే ప్రధానంగా మొగ్గు చూపుతున్నారు. అలాంటి బిందు సేద్య పరికరాలను ప్రభుత్వం ఇవ్వడంలో విఫలమవుతోంది.

అందరికీ పరికరాలు అందించాలి



నాకు పది ఎకరాల భూమి ఉంది. బిందు తుంపర సేద్య పరికరాల కోసం ఆర్బీకేలో నమోదు చేసుకుంటే 50శాతం సబ్సిడీతో పరికరాలు ఇస్తున్నారు. బిందు సేద్యం పరికరాలు పది ఎకరాలపైగా భూమి ఉన్న రైతులకు 90శాతం సబ్సిడీతో అందించాలి. రైతులు పంటల సాగుకు రూ.లక్షలు అప్పులు చేసి, నష్టాలో ఉన్నారు. బిందు తుంపర సేద్య పరికరాలు 90శాతంతో అందించాలి.

- రామాంజులరెడ్డి, రైతు, పోతులవాండ్లపల్లి

అరకొరగా ఇస్తున్నారు



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బిందు తుంపర పరికరాలు అరొకరగా అందిస్తోంది. దీంతో రైతులు ప్రైవేటు దుకాణాల్లో రూ.వేలకు వేలు ఖర్చు చేసి నాసిరకం పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. పరికరాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. పెద్ద కంపెనీకూడా పరికరాలు అందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు 90శాతం సబ్సిడీతో బిందు, తుంపర సేద్య పరికరాలు అందించాలి. దీంతో నీటిఆదాతోపాటు, పంటదిగుబడి బాగా ఉంటుంది.

- నరసింహులు, రైతు, ద్వారనాల

నిరంతరం పరికరాల పంపిణీ

రైతులకు అందించే తుంపర, బిందు సేద్య పరికరాలు నిరంతరం ప్ర భుత్వం అందిస్తూ ఉంటుంది. దరఖాస్తులు చేసుకున్న రైతులకు ప్రభు త్వం పరికరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అర్హులైన వారికి మాత్రమే పరికరాలు అందిస్తాం. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి.

- చంద్రశేఖర్, ఎంపీఎంఐపీ అధికారి

ఘనంగా సంక్రాంతి

ధర్మవరం/ ధర్మవరంరూరల్, జనవరి 16: మండలవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం సంక్రాంతి పండుగను పుర్కసరించుకుని ఇళ్లముందు రంగురంగుల ముత్యాలు ముగ్గులతో అలంకరించారు. సంప్రదాయాన్ని చాటే గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడికాయలు కొట్టి సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి సూర్యనమస్కారాలు చేసి ఇష్టదైవాన్ని పూజించారు. వివిధ రకాల పిండివంటలను చేసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడిన వారు తమ సొంతూళ్లకు తరలివచ్చారు. గ్రామాల్లో ఉన్న ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు జ్యోతులబోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ఇంటి ముందు రంగవల్లులు

కుణుతూరులో ఆటలపోటీలు: మండలంలోని కుణుతూరు గ్రామంలో మహిళలకు ప్రత్యేకంగా పలురకాల ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నిత్యావసర సరుకులతో పాటు బహుమతులు అందజేశారు. గ్రామంలోని మహిళలంతా కలిసి ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొని సందడిచేశారు. బహుమతులను కార్పెంటర్ రామాంజి, నాగేంద్ర, శ్రీనివాసులు, నారాయణస్వామి అందజేశారు.



రథంలో ఆశీనులైన సుబ్రహ్మణ్యస్వామి

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవం

ధర్మవరం, జనవరి 16: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్థానిక ఎస్ఎల్‌వీ మార్కెట్‌లోని ఆలయంలో రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు విజయ్‌కుమార్‌శర్మ శిష్య బృందం శ్రీవల్లీదేవసేన సహిత స్వామివారి విగ్రహాలకు వివిధ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వసూక్త అభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వెండి కవచసమర్పణ సేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను రథంలో ఉంచి ప్రధాన వీధులగూండా ఊరేగించారు. రథోత్సవంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను, భజనలు, కోలాటం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు.

భక్తులతో కిలకిటలాడిన పాలపాటిదిన్నె



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, జనవరి 16: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రతి యేడాది మకర సంక్రాంతి సందర్భంగా పార్వేట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 10.30 గంటలకు పాలపొంగుల దుద్దలతో స్వామివారి గుడి చుట్టు ప్రదర్శనలు నిర్వహించి, అనంతరం పాల పొంగులు నిర్వహించారు. కార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉత్సవ విగ్రహం ఊరేగింపు సాగింది. అనంతరం పార్వేటోత్సవం జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా ఏఎస్ఐ షేక్షావలీ, కానిస్టేబుల్ ప్రతాప్, రంజిత్ బందోబస్తు నిర్వహించారు.

అంగన్‌వాడీల మౌనదీక్ష

ధర్మవరం, జనవరి 16: సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తలదించుకుని మౌన దీక్ష చేపట్టారు. దీక్షలకు ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. పైగా బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి చంద్రకళ, అంగన్‌వాడీలు పోతక్క, గోవిందమ్మ, దీనా, చింతమ్మ, మాంచాలినిదేవి, భువనేశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత డిపో కోసం కృషిచేయాలి: డీఎం

ధర్మవరం, జనవరి 16: ప్రమాదరహిత డిపోగా ప్రతి ఆర్టీసీ ఉద్యోగి కృషిచేయాలని డిపో మేనేజర్ సత్యనారాయణ సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక డిపోలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను డిపో మేనేజర్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీఎం మాట్లాడుతూ ఈ మాసోత్సవాలను ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు విధులకు వెళ్లే ప్రతి డ్రైవర్, కండక్టర్ నియమనిబంధనలు పాటించాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ డిపోలో ప్రమాదాలలో జీరోగా ఉండాలని, డ్రైవర్లు మద్యం సేవించి విధులకు వెళ్లరాదన్నారు. క్రమశిక్షణతో విధులు చేసి భద్రతా సూక్తులను పాటించిసంస్థకు ఆదాయంతోపాటు మంచి పేరును తీసుకురావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడిమర్రి, జనవరి 16: పండుగ పూట సినిమా చూసేందుకు తాడిమర్రికి వచ్చి తమ గ్రామమైన మోదులకుంటకు తిరిగి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నాగాస్వామి తెలిపిన వివరాల మేరకు మోదులకుంట గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు సాకే సుదర్శన్(23), సాకే చిన్ననాగన్న కుమారుడు నరేంద్ర మంగళవారం రాత్రి తాడిమర్రికి సినిమా చూసేందుకు వచ్చారు. రాత్రి 9-30గంటల తరువాత తిరిగి మోదులకుంటకు వెళ్తుండగా పోతలయ్యస్వామి ఆలయం దాటిన తరువాత పొలంలో ఉండే నాగిరెడ్డి ఇంటి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడటంతో సాకే సుదర్శన్ అక్కడికక్కడే మృతిచెందగా నరేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. నరేంద్ర వారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లాలని సూచించారు. సుదర్శన్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా నరేంద్ర మదనపల్లి డిగ్రీ చదువుతున్నట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మోదీకి ఘనస్వాగతం

పుట్టపర్తి, జనవరి 16: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పుట్టపర్తి విమానాశ్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. మంగళవారం డిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.45కు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ ప్రధానమంత్రికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రజిత్ భార్గవ్, ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, అడిషనల్ డీజీ శంకర్‌భక్తబాజీ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, డీఐజీ అమ్మిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె దేవానంద్, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, శేఖస్వామి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీ ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1 గంటకు లేపాక్షికి వెళ్లారు. నాసిన్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగించుకుని తిరిగి పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో 5.40కి చేరుకున్నారు. ఇక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక విమానంలో బయలు దేరి కేరళకు వెళ్లారు. ప్రధానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధాని రాక నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తచెరువు, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పసలమంద, కమ్మపాళ్యం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ కరపత్రాలను పంచారు. టీడీపీ అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికలలో టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లమాడశంకర, డ్రైవర్‌కేశప్ప, మాధవి పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

పుట్టపర్తి, జనవరి 16: స్థానిక శిల్పారామంలో రెండురోజులపాటు శ్రీమదరసాయి బిల్డర్ అసోసియేషన్ సహకారంతో సంక్రాంతి సంబరాలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. సోమవారం ముగ్గులపోటీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మదనపల్లి డ్యాన్సు ప్రోగామ్ వారిచే చిన్నారులు నృత్యప్రదర్శన చేశారు. జబర్దస్త్ సునామీ సుధాకర్ తన కామెడీతో సందర్శకులను అలరింపచేశారు. రత్నాకరం కొండమరాజు ముగ్గుపోటీల విజేతలకు, సునామీ సుధాకర్, నృత్య ప్రదర్శన చేసిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

జాతీయ సంపదను సమానంగా పంచాలని కోరిన వ్యక్తి అంబేడ్కర్: విక్టర్

పుట్టపర్తి, జనవరి 16: సమాన హక్కులతోపాటు జాతీయ సంపదను అందరికి సమానంగా పంచాలని కోరిన వ్యక్తి అంబేడ్కర్ అని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చేపట్టిందని, మానవతవాదులందరూ హాజరుకావలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమాధికారి శివరంగప్రసాద్, ఎఎస్ డబ్ల్యు రెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గాండ్లపెంట, జనవరి 16: మండలంలోని నరసప్పగారిపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు(37) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు నరసప్పగారిపల్లిలో రైతు రెండున్నర ఎకరా వేరుశనగ సాగు చేశాడు. పందుల బెడద అధికంగా ఉండడంతో తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో 11కేవీ వైర్లకు కనెక్షన్ ఇస్తుండగా అదుపు తప్పి పొలం చుట్టు లాగిన విద్యుత్ తీగలపై పడి మృతిచెందాడు. ఉదయం 8గంటల సమయంలో సమీప రైతులు గమనించి సమాచారం అందజేశారు. భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో కనుమ పూజలు



ప్రత్యేక అలంకరణలో త్రిలింగేశ్వరస్వామి

ధర్మవరం రూరల్, జనవరి 16: పట్టణంలోని బెస్త వీధిలో వెలసిన శ్రీ త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కనుమపండుగను పురస్కరించుకుని ఆలయం వద్ద బసవన్నకు విశేషపూజలు చేశారు. ఆలయ అర్చకుడు రాఘవశర్మ త్రిలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు. అదేవిధంగా పాలాభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ఓబుళదేవరచెరువు, జనవరి 16: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలతోపాటు చిత్రపటాన్ని మంగళవారం మండలంలోని నారప్పగారిపల్లిలో ఇంటింటా పంపిణీ చేశారు. రెడ్డిపల్లి మహేశ్వర్‌రెడ్డి, సాదాశివరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఇంటింటికెళ్లి రాముడి అక్షింతలు, చిత్రపటం, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రెడ్డిపల్లి రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వరదారెడ్డి పాల్గొన్నగా, బొడెద్దులపల్లిలో అశ్వర్థప్ప ఆధ్వర్యంలో అక్షింతలు, చిత్రపటానికి అందించారు.

ఘనంగా తిరుమలదేవుని ఉత్సవాలు

గాండ్లపెంట, జనవరి 16: మండలపరిధిలోని బోయపల్లి వద్ద తిరుమలదేవుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా తిరుమలదేవుని భక్తులు తిరుమల దేవరకొండకు వెళ్లి ఆదివారం రాత్రి జాగరణ, చెక్కభజన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని గుడిచుట్టు ప్రదక్షిణలు చేశారు. చెక్కభజనలు, కోలాటాలు, డప్పులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి

అమడగూరు, జనవరి 16: మండలపరిధిలోని నిలువురాతి పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ పాడి ఆవుదూడ మంగళవారం కుక్కదాడిలో మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. దూడను మేతకోసం పొలంలో కట్టివేయగా వీధి కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిందన్నాడు. నాలుగురోజులక్రితం మహమ్మబాద్ సమీపంలో వీధి కుక్కలదాడిలో పెద్దసంఖ్యలో గొర్రెపిల్లలు మృతిచెందిన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మృతదేహం వివరాలు లభ్యం

నల్లమాడ, జనవరి 16: గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. వారు అందించిన వివరాల మేరకు మండలపరిధిలోని గూడమేకలపల్లి గ్రామ ప్రధాన రహదారి సమీపంలోని పిల్లి గుండ్లబావిలో గుర్తుతెలియని శవం లభించింది. గూడమేకలపల్లి గ్రామానికి చెందిన రామనర్సు కుమారుడు మహేంద్ర (24)గా గుర్తించారు. మద్యానికి బానిసై మహేంద్ర చిన్నచిన్న అప్పులు చేశాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఈనెల 2న ఇంటిలో భోజనం చేసి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈనెల 14న పిల్లి గుండ్లబావిలో శవముందని గొర్రెల కాపర్లు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి శవాన్ని బయటకు తీయగా మహేంద్రగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



మునిసిపల్ కార్యాలయం వద్ద పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

హిందూపురం అర్బన్, జనవరి 16: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకొని మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేర స్వామి విగ్రహాలను ఊరేగించారు. పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్యాలయం పక్క వీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మూల విరాట్టుకు తెల్లవా రుజాము నుంచి ప్రత్యేక పూజలు చేసి, సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు చేసి, ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అదే విధంగా పరిగి మండలంలో ని జయమంగళి నది ఒడ్డున ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో రెండు రోజులుగా వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా దాత పరిగి వేణుగోపాలరావు భక్తులకు అన్నదానం చేశారు. అదే విధంగా పలు చోట్ల మహిళలు, పిల్లలు పెద్దలు కుటంబ సమేతంగా పుట్టకు పూజలు చేశారు.



పరిగిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



గౌడనహళ్లి వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

మడకశిర రూరల్, జనవరి 16 : మండలంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు ఉపవాస దీక్షతో గ్రామ సమీపంలోని నాగులకట్ట వద్దకు, పొలాల్లో ఉన్న పుట్ట వద్దకు వెళ్లి నాగులకు పాలు పోశారు. పూజ లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా పూజల అనంతరం ఉపవాస దీక్ష విరమించారు. వనభోజనాలు చేశారు.

గుడిబండ: మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు తదితర గ్రామాల్లో మంగళవారం సుబ్రహ్మణ్యషష్ఠిని ఘనంగా నిర్వహించారు. రైతులు తమ పొలాల వద్ద సుబ్రహ్మ ణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

21న పశ్చా పార్శ్వనాథ ఆలయ వార్షికోత్సవం

పెనుకొండ, జనవరి 16 : దేశంలోని ప్రసిద్ధ జైన పీఠాలలో పెనుకొండ ఒకటి. పట్టణంలోని పశ్చాపార్శ్వనాథ దేవాలయంలో ఈనెల 21న వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అజిత ప్రసాద్ జైన్ తెలిపారు. ఉదయం నిర్వహించి ప్రతిష్ఠాచార్యులు దీన చంద్రయ్య, పార్శ్వనాథయ్య, బ్రహ్మయ్య, అజితనాథ ఆధ్వర్యంలో నిత్య పూజలు, 108కలశాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఘనగిరి శ్రీక్షేత్ర భువనకీర్తి భట్టాచారువర్య, ఎన్ఆర్ పుర శ్రీక్షేత్ర సింహనగడ్డె, లక్ష్మీసేన భట్టాకర భట్టాచార్యవర్య ధార్మిక ప్రసంగం ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా హంప నాగరాజయ్య, దూరదర్శన్ డైరెక్టర్ భారతి, చంద్రకీర్తి, సతీష్‌కుమార్‌జైన్, శ్రీయాష్‌జైన్, హాజరవుతారన్నారు. ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

రొద్దంలో ఉద్రిక్తత

ఇరువర్గాల ఘర్షణతో భయబ్రాంతుల్లో ప్రజలు



గాయపడిన మూర్తి

రొద్దం, జనవరి 16 : సంక్రాంతి పండగ రోజున ఇద్దరు వ్యక్తులు తాగి గొడవపడ్డారు. అది చిలికి చిలికి గాలి వానగా మారి రెండు వర్గాల మధ్య పరస్పర దాడులకు దారి తీసి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. రొద్దం మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు తప్పతాగి గొడవపడ్డారు. ఈ గొడవతో గ్రామంలోని రెండు సామాజిక వర్గాలకు చెందిన 30మంది ఒకరికొకరు పరస్పర దాడులకు పాల్పడ్డారు. కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకోవడంతో రొద్దం ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. భయంతో దుకాణాలు మూసేసుకుని ఇళ్లకు పరుగులు తీశారు. రొద్దంలోని పోలీసులు ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లకు వెళ్లారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో జమేదార్ నాగరాజు ఒక్కరే ఉన్నారు. ఆయనవచ్చేలోపే గొడవ జరిగిపోయింది. ఈ గొడవలో అనిల్, మూర్తి అనే ఇద్దరికి బలమైన రక్తగాయాలు కావడంతో వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ వలీబాషను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జరిగిన సంఘటనపై బుధవారం ఇరువర్గాలను పిలిపించి విచారిస్తామన్నారు.

విద్యుత్‌షాక్‌త్ రెండు ఆవుల మృతి

రైతుకు గాయాలు



ఆవుల కళేబరాలు

రొద్దం, జనవరి 16 : గుర్తుతెలియని వ్యక్తులెవరో అడవి పందుల వేటకోసం వేసిన విద్యుత్ తీగలు తగలి రెండు ఆవులు విద్యుదాఘాతానికి గురై మృతిచెందగా, రైతు కంసల చంద్రశేఖర్ తీవ్రగాయాల పాలయ్యాడు. రొద్దం మండలం శెట్టిపల్లికి చెందిన కంసల చంద్రశేఖర్, భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులతో కలిసి కోగిర గ్రామానికి వెళ్లి, పారేశప్పగారి గోపాల్ మల్బరీ ఆకును కొనుగోలుచేశాడు. దానిని వేసుకుని ఎద్దులబండిలో స్వగ్రామానికి వస్తున్నాడు. అయితే కోగిర గ్రామం నుంచి పాతర్లపల్లి మధ్యన 11 కేవీ విద్యుత్ తీగలు భూమిపై పడి ఉన్నాయి. రాత్రి7గంటల సమయంలో గమనించక బండికి కట్టిన ఆవులు వాటిని తగిలాయి. దీంతో ఎద్దులబండిపై వస్తున్న రైతులు, పాడి ఆవులకు విద్యుదాఘాతం కలిగింది. పాడి ఆవులు అక్కడికక్కడే మృతిచెందగా రైతు చంద్రశేఖర్ కుడిచేయికి విద్యుత్ తీగలు తగిలి తీవ్రగాయాలయ్యాయి. కుమారులు అశోక్, అమర్నాథ్ బండి నుంచి కిందకు దూకేయడంతో ప్రమాదం తప్పింది. రైతు భార్య లక్ష్మి అస్వస్థతకు గురైంది. బంధువులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని వారిని 108ద్వారా పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వలీబాష సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ, జనవరి 16 : మండలంలోని దాసరపల్లికి చెందిన ఓ వ్యక్తినుంచి 55 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అందదిన సమాచారంతో సోదాలు చేసి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.



మడకశిరలో ప్రత్యేక అలంకరణలో భోగి రామలింగేశ్వరస్వామి



మడకశిర సాయినాథుడి ఆలయంలో గో పూజ నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా సంక్రాంతి వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సంక్రాంతి వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం భోగి ప్రజలు రెండో రోజు సోమవారం సంక్రాంతిని, మూ డో రోజు మంగళవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇళ్ల ముంగిట, ఆలయాల ఎదుట రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచి పూజించారు. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజ లు చేశారు. మడకశిర మండలంలోని నీలకంఠాపుంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోవిందాపురం, గంగుళవాయిపాళ్యం పంచాయతీల్లోని మహిళలకు స్థానిక ఆలయం ఆవరణంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. ఆలయకమిటీ ఛైర్మన్ రఘువీరారెడ్డి ఎంతో ఆసక్తితో తిలకించారు. విజేతలకు బహుమంతులు అందజేశారు. అలాగే హిందూపురం, పెనుకొం డ, అగళి, కర్ణాటకలోని పావగడ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి సంబరా లను ఘనంగా జరుపుకొన్నారు.



నీలకంఠాపురంలో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న రఘువీరారెడ్డి

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు : గుండుమల



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జనవరి 16: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని ప్రజలు విశ్వసిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం పెరుగుతోందన్నారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం హారేసముద్రం గ్రామానికి చెందిన 15 కుంటుంబలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వైసీపీ నాయకులు ఆనంద్, ఈరమలప్ప తోపాటు పలువురు చేరారు. ఆదేవిధంగా గుడిబండ మండలం కొంకల్లుకు చెందిన వైసీపీ నాయకులు మాజీ సర్పంచ్ నరసింహమూర్తి, కెంపన్న, హనుమంతరాయప్ప, తిప్పేస్వామి, అరుణ్‌కుమార్, లక్ష్మన్న తదితర దాదాపు 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి గుండుమల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పోయిందని, తెలుగుదేశం పార్టీ వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు అని ప్రజలు గట్టిగా నమ్ముతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, నాయకులు హనుమంతేగౌడ్ ఉన్నారు.

మంజునాథస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గుండుమల తిప్పేస్వామి తదితరులు

రాష్ట్రంలోనే అత్యంత వెనకబడిన మడకశిర ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ముందుకు రావడం సంతోషించ దగ్గ విషయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పట్టణంలోని అమరా పురం బస్టాండు ఆవరణంలో సోమవారం ధర్మస్థల మంజునాథస్వామికి, ట్రస్టు ఛైర్మన్ వీరేంద్రహెగ్డే చిత్రపటాలకు క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ... ధర్మస్థల గ్రామీ ణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు వారు మడకశిర ప్రాంతంపై అపార అభిమా నా న్ని మరొక్కసారి చాటుకున్నారని, దత్తత తీసుకొని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మడకశిర నియోజకవర్గం ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈప్రాంతం అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సవిత జన్మదిన వేడుకలు



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నిమ్మల, ఈరన్న

పెనుకొండ టౌన్, జనవరి 16: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత హిందూపురంలోని శ్రీసత్యసాయి అనాథాశ్రమంలో విద్యార్థుల మధ్య ఆమె కేక్‌కట్‌చేసి విద్యార్థులకు నూతన దుస్తులు, భోజన వసతి కల్పించారు. అనంతరం పెనుకొండలో పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు తరలివచ్చి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దర్గా సర్కిల్‌వద్ద గజమాలతో సత్కరించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితర ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాలసముద్రంలో...



కేక్ కట్ చేస్తూ సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, జనవరి 16: మండలంలోని పాలసముద్రం గ్రామంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సవిత జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు కట్టుబడి ఆంజనేయులు, మాజీ డీలర్ సుబహన్ ఆధ్వర్యంలో సబిత జన్మదిన వేడుకలు జరిగాయి. బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసుకుని, విందుభోజనాలు ఏర్పాటు చేశారు. నాయకులు ప్రసాద్, రాధాక్రిష్ణ, రామలింగారెడ్డి, శ్రీనివాసులు, ఆదినారాయణ, నరేష్, బీ నరేష్ బాబా, పీ బాబా, పోతన్న, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు: సవిత

పెనుకొండ టౌన్, జనవరి 16 : రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడంలో, రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో విజన్ ఉన్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద మంగళవారం నాసిన్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా పట్టణంలోని అన్న క్యాంటిన్‌లో సవిత టీడీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవిత మాటాడుతూ... చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాసిన్ కోసం భూసేకరణతో పాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. వీటితోపాటు కియ లాంటి పరిశ్రమ తీసుకొచ్చి ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. అధికార పార్టీ వైసీపీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మొండి చేయి చూపిందన్నారు. ఇప్పటికైనా యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే టీడీపీతోనే అన్నారు. మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, గుట్టూరు మాజీ స ర్పంచ్ సూర్యనారాయణ, మంజునాథ్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గో బ్యాక్ నరేంద్ర మోదీ: ఎస్ఎఫ్ఐ

హిందూపురం అర్బన్, జనవరి 16: విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ఆంధ్రప్రదేశ్‌కు రావద్దని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయ కులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విభజన సమయంలో కేంద్రీయ విశ్వ విద్యాలయానికి సొంత భవనాలు నిర్మించి నిధులు కేటాయిస్తామని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని తెలిపారన్నారు. ఇవేవీ నెరవేర్చలేదన్నారు. ఎన్ఈపీ ద్వారా పూర్తిగా కాషాయీకరణ చేయాలనే కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, తరుణ్, నిహాల్, గురునాథ్, వినోద్, అభి తదితరులు ఉన్నారు.

'బీఎస్పీతోనే బానిస బతుకులకు విముక్తి'

హిందూపురం అర్బన్, జనవరి 16: బానిస బతుకులకు విముక్తి బహుజన సమాజ్‌వాదీ పార్టీతోనే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక ఆబాద్‌పేటలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం బీఎస్పీ జాతీయ కార్యదర్శి బెహన్ మాయావతి 68వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాయావతి చిత్రపటం ఏర్పా టు చేసి ఆమె జన్మదిన వేడుకలు జరుపున్నారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షు డు నాజీమ్ బాష, కోశాధికారి హరికు మార్, కన్వీనర్ రామాంజనే యులు, సత్యానందమూర్తి, పెన్నయ్య, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనాలు పెంచాల్సిందేనంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో డిమాండ్ చేశారు. చిలమత్తూరు, మడకశిరపట్టణ తదితర పట్టణాలు, మండల కేంద్రాల్లో 36వ రోజు సోమవారం వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అలాగే అగళిలో... ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మంచి బుద్ధి రావాలని తమ సమస్యలు పరిష్కరించాలని కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. సీఎం జగన్‌కు పంపేందుకు వారు ఇంటింటికి వెళ్లి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిలబెట్టుకోవా లన్నారు. నిరవధికంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదన్నారు. తమ డిమాండ్ల పరి ష్కారానికి చర్యలు తీసుకోకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెప్తామన్నారు. సంక్రాంతి పండగ రోజు సోమవారం కూడా సమ్మె కొనసాగించారు. దీక్షల శిబిరంలోనే పండుగను జరుపుకున్నారు. అలాగే మంగళవారం 37వ రోజు సమ్మె కొనసాగించారు.



చిలమత్తూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మడకశిరలో...

వైభవంగా నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పావగడ, జనవరి 16: భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న కర్ణాటకలోని నాగలమడకలో వెలసిన అంత్య సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వేలాది మం ది భక్తుల నడుమ సాగింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచారు. దేవాదాయ శాఖాధికారి వరదరాజు, పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, అధికారులు రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. మొదట బ్రహ్మరథోత్సవం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసింది. అనంతరం పురవీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు అరటికాయలు, సాంబ్రాణి రథంపై విసిరి, గోవింద నామస్మరణతో మొక్కులు తీర్చుకొన్నారు. పురోహితులు అన్నం రాసికి పూజలు చేసి, బ్రాహ్మణులు, వైశ్యులకు అన్న సంతర్పణ చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గిరీష్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న రథం

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గోరంట్ల, జనవరి 16: మండలంలోని గంగాదేవి పల్లిలో సంక్రాంతి సందర్భంగా గ్రామస్థులు సోమవారం ముగ్గులపోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యువత గ్రూపుగా ఏర్పడి సొంత ఖర్చుతో పండుగ వేడుకలను జరుపుకోవడం కొంతకాలంగా ఆనవాయితీగా వస్తోంది. తమ గ్రామం పేరు అందరికి తెలిసే విధంగా ఇలా పండుగ జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు. ముగ్గుల పోటీల్లో గ్రామానికి చెందిన 36 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు నంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యూత్ అసోషియేషన్‌కు చెందిన విష్ణు, ఉపేంద్రరెడ్డి, మనోజ్, సురేష్ లోకేష్ తదితరులున్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : అంబికా



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అంబికా లక్ష్మీనారాయణ

చిలమత్తూరు, జనవరి 16: ప్రజలందురూ సుఖ సంతోషాలతో ఉండాలని, వారిపై సుబ్రహ్మణ్వేశర స్వామి కృప ఎల్లపుడూ ఉండాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. మండలంలోని చేనేపల్లిలో వెలసిన సుబ్రమణ్యేశ్వర ఆలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక పూజలకు ఆయన హాజరయ్యారు. షష్ఠి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యే పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంద ర్భంగా అంబికా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేవుడిపై నమ్మకం పెంచుకోవాలన్నారు. ఆలయంలో స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు నాగేంద్ర కుమార్, సుబ్బన్న, నారాయణప్ప, నాగరాజు, గంగాధర్, ముద్దుకృష్ణ, ప్రసన్నకుమార్, రమేష్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

పీసీసీ ప్రధాన కార్యదర్శి కాలవ హరిత

హిందూపురం అర్బన్, జనవరి 16: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ పగ్గాలు చేపట్టడంతో పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం రానుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి కాలవ హరిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిడుగు రుద్రరాజును సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడంతో ఆమె ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త పని చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలాజీమనోహర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పట్టణ అధ్యక్షుడు జమీల్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఫయాజ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మహబూబ్‌భాష, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ తదితరులు పాల్గొని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

బాలవికాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



హాజరైన చిన్నారులు, వారి తల్లిదండ్రులు

హిందూపురం అర్బన్, జనవరి 16: పిల్లలకు భక్తితో కూడుకున్న చదువు అందించాలని బాలవికాస్ నిర్వాహకులు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని డీఆర్ కాలనీలోని పుట్టపర్తి సత్యసాయి బాలవికాస్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులతో కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

నాపై అసత్య ప్రచారం: జడ్పీటీసీ ఉమేష్

అగళి, జనవరి 16 : నాపై నా రాజకీయ జీవితంపై కొందరు తప్పుడు ప్రచారం చేయడానికి ఫేస్‌బుక్ ఐడీ తయారు చేసి పబ్లిక్ చేస్తున్నారని జడ్పీటీసీ ఉమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై బురదజల్లేందుకు ఫేస్‌బుక్ ఐడీ తయారుచేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీరిని కఠినంగా శిక్షించాలని మంగళవారం అగళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదేవిధంగా మునుపు ఒకసారి దుష్ప్రచారం చేశారని అన్నారు.